క్లుప్తంగా

రోగులకు పౌష్టికాహారం పంపిణీ



ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దాతలు

డోన్: ప్రభుత్వాస్పత్రిలోని రోగులు, వారి సహాయకులు, గర్భిణులు, బాలింతలకు ఆదివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్యాపిలి మండలం బావిపల్లికి చెందిన దాత రెడ్డి జనార్దన్ సహాయంతో రొట్టెలు, గుడ్లు, పప్పు అందజేశారు. ఆదరణ వృద్ధాశ్రమం నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజీ ఇవ్వాలని వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సీఆర్పీలు

బనగానపల్లె రూరల్: ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో సీఆర్పీలకు వెయిటేజీ ఇవ్వాలని నంద్యాల యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఆదివారం ఆయన క్యాంప్ ఆఫీస్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖలో సీఆర్పీలు ఎన్నో ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నా వేతనాల పెంపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

కొత్త చట్టాల పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ తిరుపాల్

బనగానపల్లె రూరల్: ఇటీవల అమల్లోకి వచ్చిన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ తిరుపాల్ అన్నారు. ఆదివారం మండలంలోని నందివర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని రామతీర్థం గ్రామంలో ఎస్‌ఐ తిరుపాల్ పర్యటించారు. గ్రామస్తులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఇండియన్ పీనల్ కోడ్ 1960 స్థానంలో భారతీయ న్యాయ సంహిత, సీఆర్‌పీసీ 1973 స్థానంలో భారతీయ నాగరిక్ సంరక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 స్థానంలో భారతీయ సాక్ష్య అధినియం చట్టాలుగా మార్పు చేశారని వివరించారు. ఈ ఏడాది జూలై నుంచి కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని తెలిపారు. చిన్న కేసులకు కూడా పెద్ద శిక్షలు పడే అవకాశం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకుడు

కోవెలకుంట్ల: పట్టణంలోని పెద్దబార్ ఇమాం చావిడి సమీపంలో కోవెలకుంట్లకు చెందిన అబ్దుల్‌కలాం ఆజాద్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. పట్టణానికి చెందిన 30 మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం కంటి వైద్య శిబిరంలో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, బనగానపల్లెకు చెందిన కంటి వైద్యుడు నాజర్ 74 మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్‌మెంబర్ దిల్క్‌బాషా, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ముస్లిం పెద్దలు ముక్తి అబ్దుల్ హాదీ, మౌలానా అబ్దుల్ మజీద్, అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

మంగపల్లెలో వైద్య శిబిరం



వైద్య శిబిరానికి తరలివచ్చిన జనం

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు గుండె, బీపీ, షుగర్, కంటి, ఊపిరితిత్తులు, ఎముకలు తదితర సమస్యలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డి, పెద్దిరెడ్డి షేక్షావల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా చంద్రశేఖర్

కోవెలకుంట్ల: మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌కు బాధ్యతలు అప్పగించారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన జయప్రకాష్ రెండు రోజుల క్రితం రిలీవ్ అయి సొంత జిల్లా చిత్తూరుకు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించేంత వరకు తాత్కాలికంగా చంద్రశేఖర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

నకిలీ మందులతో జాగ్రత్త

- ప్రస్తుతం జోరుగా ఖరీఫ్ పంటల సాగు
- మార్కెట్‌లో నకిలీ పురుగు మందులు, విత్తనాల బెడద
- కొనుగోలు సమయంలో జాగ్రత్తలు తీసుకోకుంటే నష్టపోయే ప్రమాదం
- రశీదు తీసుకోవడం తప్పనిసరి
- అన్నదాతలకు అధికారుల సూచనలు



డోన్‌లో పురుగు మందుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు (ఫైల్)

డోన్ రూరల్: ఖరీఫ్ సీజన్ కావడంతో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. ఈ తరుణంలో రైతులు పంటల పొలాలకు ఎరువులు అధికంగా వినియోగిస్తారు. అదే అదునుగా మార్కెట్‌లోకి నకిలీ ఎరువులు, పురుగుల మందులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉంది. కొనుగోలు సమయంలో అప్రమత్తంగా లేకుంటే నష్టపోయే ప్రమాదం ఉంది. ఒకటికి రెండుసార్లు ఆలోచించుకుని అన్ని వివరాలను పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- లైసెన్సు లేని వ్యక్తులు, దుణాకాలు, దళారులు, ఇతరత్రా వ్యాపారుల నుంచి కొనుగోలు చేయకూడదు. తక్కువ ధరకే మందులు విక్రయిస్తున్నారు కదా అని కొనుగోలు చేస్తే పంట దిగుబడి తగ్గడంతో పాటు భూసారం దెబ్బతింటుంది. జవాబుదారీతనం సైతం ఉండదు.
- సరుకు లాట్ నంబర్, తయారీ తేదీ, రకం ఇలా అన్ని వివరాలు కలిగి ఉంటేనే కోనాలి. సంతకం చేసిన బిల్లును విక్రయదారుల నుంచి తప్పనిసరిగా పొందాలి.
- సంచులపై సీలు విప్పినట్లు లేదా విప్పదీసి తిరిగి కుట్లు వేసినట్లు కనిపిస్తే కొనకూడదు.
- వ్యవసాయ శాఖ అనుమతి పొందిన డీలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలి.
- విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బస్తాలో లభించే చీటీ (ట్యాగ్) ఉందో లేదో గమనించాలి. చీటీ ఉంటేనే కొనుగోలు చేయాలి. ఆ చీటీని ఏడాది పాటు భద్రంగా ఉంచుకోవాలి.
- క్రిమి సంహారక మందుల డబ్బాపై కంపెనీ పేరు, తయారీ తేదీ, కాల పరిమితిని గమనించి అందుకు అనుగుణంగా బిల్లులు తీసుకోవాలి.
- ఏదీ ఎంత ధరకు కొన్నా డీలర్ లేదా దుకాణదారుడి సంతకంతో బిల్లు పొందాలి. నకిలీవని అనుమానం వస్తే మండల వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. ఉచితంగా నకిలీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవచ్చు.
- లైసెన్సు లేకుండా విత్తనాలు, ఎరువులు, మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.
- నకిలీవి అని తేలితే విత్తనం, ఎరువులు, క్రిమిసంహారక చట్టాల ప్రకారం సంబంధిత డీలరు, కంపెనీ దుకాణదారునిపై కేసు నమోదు చేస్తారు.

పరిశీలన తప్పనిసరి



రైతులు పురుగు మందులు కొనుగోలు చేసే సమయంలో డబ్బాపై ఉన్న వివరాలను పూర్తిగా పరిశీలించాలి. లేదా తెలిసిన వారికి చూపించి అది ఏ కంపెనీదో నిర్ధారించిన తరువాతనే కొనుగోలు చేయాలి. డబ్బాపై చూపించిన వివరాల ప్రకారమే మందు పిచికారీ చేయాలి. లేదంటే పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. ఎక్కడైనా నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే ఆయా దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేస్తాం. మందులు కొనుగోలు చేసిన రైతులకు డీలర్, దుకాణ యజమాని సంతకాలలో కూడిన బిల్లులను అందజేయాలి.

–అబ్దుల్‌షఫీ, మండల వ్యవసాయ అధికారి, డోన్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బేతంచెర్ల: పట్టణ పరిధిలో జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులను దృష్టిలో ఉంచుకుని సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు డోన్ రహదారిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీ మధుసూదన్ రెడ్డి ఆదివారం తెలిపారు. పరిశ్రమల యజమానులు, విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కోవెలకుంట్ల: విద్యారంగంలో నెలకొన్న వివిధ సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తోజ్ వీరబ్రహ్మం డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 117 జీఓను రద్దు చేసి 3,4,5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగించాలన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విద్యా వలంటీర్లను నియమించాలని, మినిమం టైంస్కేల్, ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సు మిగితా ఉద్యోగుల్లా 62 ఏళ్లకు పెంచాలని, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల చెల్లింపుపై దృష్టి సారించాలని కోరారు.

ధూమపానంతో అనేక ఆరోగ్య సమస్యలు

బనగానపల్లె: ధూమపానం, మద్యపానంతో అనేక అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి అన్నారు. పలుకూరు గ్రామంలోని రామాలయంలో ఆదివారం ధూమపానం, మద్యపానం వల్ల కలిగే నష్టాలపై కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ధ్యానం, భక్తిభావంతో చెడు వ్యసనాల నుంచి బయటపడవచ్చని తెలిపారు. బాలసరస్వతి భజన మండలి అధ్యక్షుడు వెంకటసుబ్బయ్యగౌడ్, బాలహనుమంత్, తిరుమలేష్ పాల్గొన్నారు.



కరపత్రాన్ని విడుదల చేస్తున్న జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు



అన్నదానం చేస్తున్న ప్రభుత్వ పెన్షనర్లు

లెప్రసీ కాలనీలో అన్నదానం

డోన్: ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ పొందిన తర్వాత సామాజిక సేవలో పాల్గొంటే అంతులేని ఆత్మ సంతృప్తి కలుగుతుందని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్ అన్నారు. ఆదివారం స్థానిక లెప్రసీ కాలనీలో సంఘం కోశాధికారి గోపాల్, సభ్యులు రాందాస్‌రెడ్డి స్థానికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంఘం అసోసియేటెడ్ అధ్యక్షుడు సుబ్బరాయుడు, ఉపాధ్యక్షుడు దాసప్ప పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

డోన్ టౌన్: క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్ అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని బుగ్గన శేషారెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం ప్రారంభమైన జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్ పోటీలకు ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఇతర ప్రాంతాలకు చెందిన క్రీడాకారులతో పరిచయాలు ఏర్పడి తత్సంబంధాలు నెలకొంటాయన్నారు. కార్యక్రమంలో రూరల్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐలు గోపాల్, శ్రీనివాసులు, డాక్టర్లు బాలచంద్రారెడ్డి, రాజేంద్రప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ నారాయణ, కౌన్సిలర్ నాగేంద్ర, జహంగీర్, కరుణాకర్, లోకేష్, మదన్ పాల్గొన్నారు.



క్రీడాకారులతో జడ్జి రాహుల్ అంబేడ్కర్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఎస్కేపీ పూర్వ విద్యార్థులు

డోన్ టౌన్: స్థానిక ఎస్కేపీ హైస్కూల్‌లో 1991–92 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు మధు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ తెల్ల చొక్కాలు ధరించి పాత బస్టాండ్ నుంచి ర్యాలీగా ఫంక్షన్ హాల్ చేరుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. అనంతరం పాఠాలు చెప్పిన గురువుల పాదాలకు నమస్కరించి వారిని ఘనంగా సత్కరించారు.



మొక్కలతో స్వాగతం పలుకుతున్న మోడల్ స్కూల్

ప్రకృతి ఒడిలో మోడల్ స్కూల్

బేతంచెర్ల: మండలంలోని గోరుమానుకొండ సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ పచ్చని మొక్కలతో ఆహ్లాదకరంగా ఉంది. పాఠశాల ఆవరణ, తరగతి గదుల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో బాదం, కానుగ, వేప, టేకు, నేరేడు, దానిమ్మ, బిల్వం చెట్లు నాటడంతో పరిసరాలు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. మొక్కల మధ్య పిచ్చి మొక్కలు రాకుండా గ్రావెల్ వేయించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంరక్షిస్తుండడంతో మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. మానవుని జీవనం ప్రకృతితో ముడిపడి ఉందన్నట్లుగా మోడల్ స్కూల్ ప్రకృతి రమణీయతను సంతరించుకుంది.



తరగతి గదుల మధ్య పచ్చని మొక్కలు

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

సంజామల: మండలంలో వ్యవసాయ రంగానికి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ముక్కమల్ల, వసంతాపురం, కమలపురి, ఆల్వకొండ, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, అక్కంపల్లె, రామిరెడ్డిపల్లె, ముక్కమల్ల, కానాల, ముదిగేడు, రెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్లలో ఈ సమయంలో 9 గంటల విద్యుత్ సరఫరా ఉంటుందని వెల్లడించారు.

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో 9 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

మద్యం విక్రేతపై కేసు నమోదు

బేతంచెర్ల: పట్టణంలోని సుంకులమ్మ ఆలయం వద్ద ఆదివారం మద్యం విక్రయిస్తున్న హనుమాన్ నగర్ కాలనీకి చెందిన రామకృష్ణ నుంచి 20 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రమణ తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయించే వారిపై పోలీసులకు సమాచారంఇవ్వాలన్నారు.

40 లీటర్ల సారా స్వాధీనం

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండా సమీపంలో నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించినట్లు హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి ఆదివారం తెలిపారు. పోలీసులను చూడగానే బుగ్గానిపల్లె తండా గ్రామానికి చెందిన తార్ నాయక్, స్వామి నాయక్ పారిపోయారన్నారు. ఘటన స్థలం వద్ద 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ముగిసిన కొడి పీర్ల వేడుకలు



బైటిపేట కొడి పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు

బేతంచెర్ల: పట్టణంలో బైటిపేట, కోటపేట, గౌరిపేట, జెండాపేట, తహసీల్ పేట కాలనీల్లో వారం పాటు జరిగిన కొడి పీర్ల వేడుకలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు బైటిపేట మౌలాలీ స్వామి దర్గా నుంచి మంగళవాయిద్యాల మధ్య భక్తిశ్రద్ధలతో కొడి పీర్లను ఆయా కాలనీల్లో ఊరేగింపు నిర్వహించారు. ముగింపు వేడుకల్లో పట్టణంలోని యువకులు, ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కమిటీ



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన అధ్యక్ష, కార్యదర్శులు

కోవెలకుంట్ల: పట్టణంలోని స్కంద కమ్యూనిటీ హాలులో రోటరీక్లబ్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోవెలకుంట్ల మండల క్లబ్ అధ్యక్షుడిగా దొర్నిపాడు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, సెక్రటరీగా స్కూల్ అసిస్టెంట్ వెంకటరాముడిని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు రోటరీక్లబ్ డీజీ శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ రవికుమార్, మాజీ అసిస్టెంట్ గవర్నర్లు మాలెపాటి రాజశేఖర్, జయకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు బాలాంజనేయరెడ్డి, నాగేశ్వరరెడ్డి, మోహనమూర్తి, పెండేకంటి సుబ్రమణ్యం, శివరామకృష్ణ, శిల్పా సుబ్రమణ్యం, జగదీష్‌కృష్ణ, శేషారెడ్డి పాల్గొన్నారు.

ముందుకొచ్చిన ప్రమాదం





ఎగ్గొని గ్రామం సమీపంలో రోడ్డుపై వచ్చిన కంపచెట్లు , ముక్కమల్ల శివారులో..

సంజామల: మండలంలోని పలు రోడ్లపైకి ముళ్ల చెట్లు, పిచ్చిమొక్కలు చొచ్చుకురావంతో ఎదురుగా వచ్చే వాహనాలు సరిగ్గా కనిపించక ప్రమాదాలకు కేంద్రాలుగా మారే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ రోడ్లలో నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. వాహనదారుడు ఏ మాత్రం ఏమరుపాటు వహించినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. మండలంలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి వెంట కంపచెట్లతో వాహనాదారులు ఇబ్బంది పడుతున్నారు. ముదిగేడు నుంచి సంజామలకు వెళ్లే దారిలో ఎగ్గొని గ్రామ సమీపంలో కంప చెట్లు రోడ్డుకు ఇరువైపులా రోడ్డు మీదకు వచ్చాయి. ఆ రోడ్డు సింగిల్ రోడ్డు కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక వైపు రోడ్డుపై గుంతలు.. మరో వైపు కంప చెట్లు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సంజామల నుంచి గిద్దలూరు, అల్వకొండ క్రాస్ నుంచి పేరుసోముల మార్గం, కోవెలకుంట్ల–అవుకు ప్రధాన రహదారిలో ముక్కమల్ల గ్రామ సమీపంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గిద్దలూరు నుంచి ఆర్.లింగదిన్నె రహదారిలో గిద్దలూరు శివారులో ఎల్‌ఆకారం రహదారి మలుపు ఉంది. అక్కడ రోడ్డుకు సగ భాగానికి కంపచెట్టు కొమ్మలు అల్లుకుపోయాయి. అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే కంపచెట్లు, పిచ్చిమొక్కలను తొలగించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



గిద్దలూరు–ఆర్.లింగందిన్నె మార్గంలో..

ముద్దవరం రోడ్డు గుంతల మయం



బేతంచెర్ల: మండల పరిధిలోని ముద్దవరం రోడ్డు గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మురుగునీరు వెళ్లేందుకు డ్రైనేజీ కాలువ లేకపోవడంతో నీరంతా రోడ్డుపై చేరి గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు మీదుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించి మురుగు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో నిలిచిన వర్షపునీరు



గుంతలమయంగా మారిన కస్తూర్బా రహదారి

అధ్వానంగా పాఠశాల రోడ్లు

డోన్: ఉడుములపాడు గ్రామ పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా, గురుకుల పాఠశాలలకు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో ఉడుములపాడు వద్ద 44వ జాతీయ రహదారి నుంచి ఏపీ మోడల్ స్కూల్ వరకు తారు రోడ్డును నిర్మించారు. అయితే అక్కడి నుంచి కస్తూర్బా గాంధీ, సివిల్‌సప్లైస్ గోడౌన్ వరకు మోడల్ స్కూల్ మీదుగా ఉన్న రహదారి పనులు పెండింగ్ పడడంతో అధ్వానంగా తయారైంది. మోడల్ స్కూల్ ఆవరణ అంతా వర్షపునీటితో నిండి విద్యార్థులు, ఉపాధ్యాయులకు అసౌకర్యంగా మారింది. కస్తూర్బా స్కూల్‌కు వెళ్లాల్సిన రోడ్డు గుంతల మయంగా మారడంతో ఆటోలో వెళ్లే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అయితే ఈ రహదారి ద్వారానే నియోజకవర్గంలోని పలు గ్రామాల రేషన్‌షాపులకు సివిల్ సప్లైస్ గోడౌన్ నుంచి బియ్యం లారీలు వెళ్తుండడంతో రోడ్డు మరింత శిథిలమైంది. గోడౌన్‌కు పాఠశాలల మీదుగా కాకుండా రోడ్డును నేరుగా ఎన్‌హెచ్ 44కు అనుసంధానం చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. వాహనాల రణగొణ ధ్వనుల మధ్య విద్యార్థులలో ఏకాగ్రత కూడా దెబ్బతింటుందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి ఈ రహదారులను నిర్మించాలని కోరుతున్నారు.